# రేషన్ దుకాణాల వద్ద కనీస సదుపాయాలు తప్పనిసరి

-గుంతకల్లు సిఎస్ డిటి సుబ్బలక్ష్మి



**గుంతకల్లు, ఏప్రిల్ 3 (డ్రీమ్ టైమ్స్):**
రేషన్ దుకాణాల వద్ద కనీస సదుపాయాలు తప్పనిసరి ఏర్పాటు చేయాలని సి ఎస్ డి టి సుబ్బలక్ష్మి డీలర్లను ఆదేశించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం డ్రీమ్ టైమ్స్' ప్రతినిధితో మాట్లాడారు. ఎండలు, వడగాలుల దృష్ట్యా రేషన్ దుకాణాల వద్ద కనీస సదుపాయాలు కల్పించాలని ఆమె సూచించారు. ఇందుకు సంబంధించి నిర్దేశిత శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ నుండి తమకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయన్నారు. గుంతకల్లు పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లో ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. కార్డు దారులకు తాగునీరు, నీడ వసతులు కల్పించాలన్నారు. ప్రతి దుకాణంలో తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు ఉండాలన్నారు. కార్డుదారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసే సమయంలో రేషన్ దుకాణాలను విజిలెన్స్, పోలీసు, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు ఏ క్షణమైనా తనిఖీ చేసే అవకాశం ఉందన్నారు. కావున రేషన్ డీలర్లు కార్డుదారులకు కనీస సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని అన్నారు. ఈనెల 15 వ తేదీ వరకు సరుకుల పంపిణీ జరిగేలా చూడాలన్నారు.

## పోలీసు వారిఅనుమతి లేకుండా ర్యాలీలు,ధర్నాలు, చేస్తే చర్యలు తీసుకుంటాం, సిఐ పి. చంద్రశేఖర్



**రైల్వే కోడూరు, ఏప్రిల్ 3 డ్రీమ్స్ టైమ్స్**
రైల్వే కోడూరు పట్టణంలోని పోలీస్ కార్యాలయంలో శుక్రవారం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి చంద్రశేఖర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేణిగుంట డిఎస్పి వై .శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రైల్వే కోడూరుమండల పరిధి లో సెక్షన్ 30 అమలులో ఉన్నందున ముందస్తు పోలీసు వారి అనుమతి లేకుండా ఎటువంటి ర్యాలీలు ,ధర్నాలు, రాస్తారోకోలు ,సమావేశాలు నిర్వహించడం మరియు నలుగురు లేదా అంతకంటే ఎక్కువమందిగుంపులు గుంపులుగా ఉండడాన్ని పూర్తిగా నిషేధించడమైనది తెలిపారు. పోలీసు వారి సెక్షన్ 30 ఎవరైనా నిబంధనలు క్రమించినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఆయన హెచ్చరించారు. ప్రజా శాంతి భద్రత దృశ్య అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు ,మరియు ఇతర సంఘాల వారు పోలీసు వారికి సహకరించాలన్నారు. ర్యాలీలకు సమావేశాలకు జరపాలనుకుంటే రేణిగుంట సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వై .శ్రీనివాసరావు వారిచే తప్పని అనుమతి తీసుకోవాలని ఆయన తెలిపారు.

## దాడి చేసిన తాతంశెట్టి నాగేంద్ర నువెంటనే అరెస్టు చేయాలి-హర్ష వీణ.



**రైల్వే కోడూరు, ఏప్రిల్ 3 డ్రీమ్స్ టైమ్స్**
రైల్వే కోడూరు పట్టణంలోని స్థానిక పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో పనిచేసే చిరుద్యోగి హర్ష వీణ, మరియు న్యాయవాది సాయి కృష్ణ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టోల్గేట్ సెంటర్ దగ్గర గురువారం పూలు కొనుక్కునే దానికి వస్తుండగా సాయంత్రం 7 గంటల ప్రాంతంలో జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర వారి అనుచరులు నాపై దాడి చేసి కులం పేరుతో దూషించి నాకు రక్షణగా వచ్చిన గోపి పై రాడ్లతో, విచక్షణరహితంగా దాడి చేయడం తో ఎలాగో వారి నుండి ప్రాణభయముతోతప్పించుకొని పోలీస్ కార్యాలయంలో వారిపై కంప్లైంట్ ఇచ్చామని ఆమె తెలిపారు. నాకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని తెలిపారు. నేషనల్ ఎస్టీ ఎస్సీ కమిషన్ మరియు రాష్ట్రపతిని కూడా కలిసి నాకు జరిగిన అన్యాయంపై తెలియజేస్తామన్నారు. నాకు తాతంశెట్టి నాగేంద్ర, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వలన ప్రాణ హాని ఉందని నాకు ఏదైనా జరిగితే ఇద్దరు బాధ్యత వహించి వలసి వస్తుందని ఆమె తెలియజేశారు.

# పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం




**గుంతకల్లు, ఏప్రిల్ 3 (డ్రీమ్ టైమ్స్):**
గ్రామపంచాయతీల పాలకవర్గాలకు ఈనెల 2వ తేదీన పదవీకాలం గడువు ముగియడంతో శుక్రవారం నుండి ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. ఆయా పంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యులు తాజా మాజీలు అయ్యారు. ఇందులో భాగంగా గుంతకల్లు నియోజకవర్గ పరిధిలోని గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాల్లోని ఆయా పంచాయతీలకు తహ శీల్దారులు, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఎంఈఓలు, వ్యవసాయ, పశు వైద్య అధికారులు ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. గుంతకల్లు నియోజకవర్గ పరిధిలోని గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాల్లోని ఆయా పంచాయతీలకు నియమితులైన ప్రత్యేక అధికారులు వివరాల ఇలా ఉన్నాయి.

**గుంతకల్లు:**
గుంతకల్లు మండలంలో మొత్తం 25 గ్రామపంచాయతీలు ఉన్నాయి. నక్కనదొడ్డి, దంచర్ల పంచాయతీలకు మండల తహశీల్దారు ఎస్. రమా దేవి, నాగసముద్రం చింతలపల్లి పంచాయతీలకు ఎంపీడీఓ యు. దేవదాసు, గుర్రబ్బాడు, కదిరిపల్లి, పాత కొత్త చెరువు పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీఓ పి. నాగభూషణం, కొంగనపల్లి, ఓబులాపురం పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీఓ(జి ఎస్ డబ్ల్యూ ఎస్), ఎన్. తిమ్మాపురం, నల్ల దాసర పల్లి పంచాయతీలకు ఎంఈఓ -1 ఎం.మస్తాన్ రావు, కసాపురం, దోసలుడికి పంచాయతీలకు ఎంఈఓ -2 సుబ్బరాయుడు, దోనిముక్కల, జి. కొట్టాల పంచాయతీలకు మండల వ్యవసాయ అధికారిణి డి. లీనా వసుంధర, అయ్యవారిపల్లి, ఇమాపురం పంచాయతీలకు డిప్యూటీ తహశీల్దారు ఎన్. నారాయణస్వామి, గుండాల, గుండాల తాండ, వై.టీ చెరువు పంచాయతీలకు డిప్యూటీ తహశీల్దారు (ఎన్నికలు) జె. కేశవరెడ్డి, మొలకల పెంట, ఎన్ వెంకటం పల్లి, నెలగొండ పంచాయతీలకు డిప్యూటీ తహశీల్దారు (రీ - సర్వే), పులిగుట్టపల్లి, పులిగుట్టపల్లి పెద్ద తాండ పంచాయతీలకు వెటర్నరీ సర్జన్ (పశుసంవర్ధక శాఖ) డాక్టర్. హరీష్ నియమితులయ్యారు.

**గుత్తిలో :**
గుత్తి మండలంలో 24 గ్రామపంచాయతీలు ఉన్నాయి. కరిడికొండ, ఊబిచర్ల, ఊటకల్లు పంచాయతీలకు గుత్తి మండల తహశీల్దారు జి.పుణ్యవతి, లచ్చానిపల్లి, శ్రీపురం (కొజ్జేపల్లి) పంచాయతీలకు డిప్యూటీ తహశీల్దారు ఎం. సూర్యనారాయణ, ఇసురాళ్లపల్లి, జక్కల చెరువు, బసినేపల్లి, కొత్తపేట పంచాయతీలకు ఎంపీడీఓ డి. ప్రభాకర్ , తొండపాడు, టి.కొత్తపల్లి పంచాయతీలకు ఎంఈఓ -1 బి. రవి నాయక్, వన్నేదొడ్డి, ధర్మాపురం, బసినేపల్లి తండా పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీఓ(జిఎస్ డబ్ల్యూఎస్)ఐ. ఈశ్వరయ్య, పెద్దొడ్డి, చెర్లోపల్లి పంచాయతీలకు ఎంఈఓ - 2 జి. మనోహర, మాముడూరు, అబ్బేదొడ్డి, తురకపల్లి, రజాపురం పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీఓ టి. నరసింహారెడ్డి, పి. ఎర్రగుడి, బ్రాహ్మణపల్లి పంచాయతీలకు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పాలగిరి ప్రదీప్ కృష్ణ,
బేతాపల్లి, వెంగన్నపల్లి పంచాయతీలకు మండల వ్యవసాయ అధికారి పి. ముస్తాక్ అహ్మద్ నియమితులయ్యారు.

**పామిడి:**
పామిడి మండలంలో 20 పంచాయతీలు ఉన్నాయి. గజరాంపల్లి, నీలూరు పంచాయతీలకు సి. షర్మిల, పామిడి, దేవరపల్లి పంచాయతీలకు ఎంపీడీఓ కె. తేజోష్ణ, ఎద్దులపల్లి, గులిమి కొండ కొట్టాల పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీఓ వై. అశ్వత్థామ నాయుడు, ఎదురూరు, రామరాజుపల్లి, కట్ట కింద పల్లి పంచాయతీలకు డిప్యూటీ తహశీల్దారు రామకృష్ణ, అనుంపల్లి, ఖాదర్ పేట పంచాయతీలకు ఎంఈఓ -1 ఎస్. జయ నాయక్, రామగిరి, కత్రిమల పంచాయతీలకు ఎంఈఓ -2 జి. సత్యనారాయణ, రామగిరి ఎగువ తండా, పాల్యం తండా, దిబ్బసానిపల్లి, పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీఓ (ఎస్ జి ఎస్ డబ్ల్యూ) పి. రంగనాయకులు, సొరకాయల పేట, కండ్లపల్లి పంచాయతీలకు మండల వ్యవసాయ అధికారి టి. విజయ్ కుమార్, వంకరాజు కాల్వ పంచాయతీకి వెటర్నరీ డాక్టర్ పి. ఉషా కిరణ్ నియమితులయ్యారు.

# ఏపీ భవిష్యత్తుకు ప్రతీక అమరావతి

-కావడి ప్రవీణ్ కుమార్
-ప్రజల ఆకాంక్ష గెలిచింది...
రాజధానిగా అమరావతి శాశ్వతం
-మోడీ- చంద్రబాబు- పవన్ ల కృషి ఫలితం
: అమరావతికి పార్లమెంట్ గ్రీన్ సిగ్నల్



**తనకల్లు ఏప్రిల్ 3 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించే బిల్లును పార్లమెంట్ ఆమోదించడం పట్ల తనకల్లు మండల తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజల దీర్ఘకాలిక ఆశయానికి కేంద్ర ప్రభుత్వం న్యాయం చేసినట్లు పేర్కొన్నారు. అమరావతి రాజధాని బిల్లును పార్లమెంట్ ఆమోదించడంతో రాష్ట్ర ప్రజలంతా ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీలు, ఎంపీలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామని అమరావతికి నిరంతర సహకారం అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు ప్రత్యేక కృతజ్ఞతలు అని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడాన్ని కొంతమంది జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని, అలాంటి వారికి ప్రజలే తగిన సమాధానం ఇస్తారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అపార అనుభవంతో అమరావతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అమరావతి భావితరాల అభివృద్ధికి కేంద్రబిందువుగా మారబోతోంది. ఇది కేవలం రాజధాని మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు ప్రతీక. రాష్ట్ర ప్రజల ఆకాంక్షల ప్రకారం అమరావతినే శాశ్వత రాజధానిగా కొనసాగించాలనే సంకల్పానికి పార్లమెంట్ మద్దతు ఇవ్వడం చారిత్రాత్మకం అని పేర్కొన్నారు. పార్లమెంట్ వేదికగా వైసీపీ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం విచారకరమని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు అమరావతినే రాజధానిగా కోరుకుంటున్నారని, ఈ నిర్ణయం ప్రజాస్వామ్యానికి నిదర్శనమని అన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ ల కృషి ఫలితంగానే దేశంలోని పలు పార్టీలు అమరావతికి మద్దతు తెలిపాయని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఘనంగా సామూహిక ఉచిత వివాహాలు





**గుంతకల్లు, ఏప్రిల్ 3 (డ్రీమ్ టైమ్స్)**
మండల పరిధిలోని నాగసముద్రం గ్రామంలో కదిరప్ప స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉచిత సామూహిక వివాహాలు ఘనంగా నిర్వహించారు. కీర్తిశేషులు సింగంశెట్టి పెద్ద వెంకట రాముడు అంజనమ్మల జ్ఞాపకార్థం ప్రతి ఏటా సింగంశెట్టి నాగమణి విశ్వనాథ్ దంపతులు, సింగంశెట్టి సోదరులు సీతారామయ్య, దామోదర్, శ్రీనివాసులు, మునిస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సామూహిక వివాహాల నిర్వహణకు గుంతకల్లు పట్టణానికి చెందిన సాయి కృష్ణ నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ పత్తి హిమబిందు, డాక్టర్ శ్రీ గ్రంధి నాగ వెంకటేశ్ దంపతులు ఒక జంటకు కళ్యాణ దాతగా వ్యవహరించి స్వయంగా వారు ఈ కార్యక్రమంలో పాల్గొని తాళిబొట్టు అందజేసి వధూవరులను ఆశీర్వదించాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సింగంశెట్టి విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా 15 జంటలకు సామూహిక వివాహాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి సంధి రెడ్డి శ్రీనివాస్, అనంతపురం పార్లమెంటు కన్వీనర్ జీఎన్ఎస్ లలిత్ కుమార్, జిల్లా కార్యదర్శి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సామూహిక వివాహాలకు కర్ణాటక నుండి రెండు, కడప జిల్లా నుంచి ఒక జంట కర్నూలు జిల్లా నుండి రెండు జంటలు, గుంతకల్లు, పామిడి, వజ్రకరూరు మండలాల నుంచి 10 జంటలు హాజరయ్యాయి. ఈ సామూహిక ఉచిత వివాహాలు 2018 నుండి నిర్వహిస్తున్నట్లు సింగంశెట్టి విశ్వనాథ్ తెలిపారు. పుల్లయ్య, పుల్లగూర రామయ్య, శ్రీధర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, సుంకిరెడ్డి, కదిరప్ప స్వామి దేవాలయ అర్చకులు పెద్ద కదిరప్ప స్వామి, చిన్న కదిరప్ప, జయసింహా గ్రామపెద్దల ఆధ్వర్యంలో మధ్యాహ్నం కలశ ప్రతిష్ట. సాయంత్రం లక్ష్మీ నరసింహా స్వామి రథోత్సవ కార్యక్రమాలు ఘుఘువైభవంగా జరిగాయి.

# శ్రీ దీక్షా పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం




**కోడుమూరు ఏప్రిల్ 3 (డ్రీమ్ టైమ్స్)**
కోడుమూరు పట్టణంలోని శ్రీ దీక్షా పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ-1 జె. రామచంద్రుడు, కర్నూలు దుపాటి ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ మురళీధర్ చౌదరి, మాజీ ఉప సర్పంచ్ జి. ప్రవీణ్ కుమార్, పాఠశాల అధ్యక్షుడు బ్యాంకు లింగన్న పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంఈఓ రామచంద్రుడు మాట్లాడుతూ పాఠశాలలో అన్ని వసతులతో కూడిన ఉత్తమ విద్యా వాతావరణం కల్పిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు మంచి విలువలు అలవరచుకోవాలని సూచించారు.పాఠశాల అభివృద్ధి దిశగా యాజమాన్యం చేస్తున్న కృషిని అతిథులు ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కారస్పాండెంట్ శిరీష వార్షిక నివేదికను సమర్పించారు. డైరెక్టర్ రవి ప్రకాష్ మాట్లాడుతూ పాఠశాల ప్రగతికి మరింత కృషి చేస్తామని తెలిపారు.అలాగే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా వీక్షించారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## లోకాకళ్యాణార్ధం.. గ్రామదేవతకు విశేష పూజలు..



**శ్రీశైలం ఏప్రిల్ 3 (డ్రీమ్ టైమ్స్)**
:శ్రీగిరి క్షేత్రంలో లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి శుక్రవారం ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది.తదుపరి లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేషఅభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

## కడప జిల్లా లో పలు వివాహ కార్యక్రమంలకు హాజరు అయిన కాటసాని బ్రదర్స్



**బనగానపల్లె, ఏప్రిల్ 3 (డ్రీమ్ టైమ్స్)**
వైయస్సార్ కడప జిల్లాలో పలు వివాహ కార్యక్రమాలకు హాజరు అయి నూతన వధూవరులను ఆశీర్వదించిన బనగానపల్లె నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి ,అవుకు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి

## శ్రీ మఠంలో అన్నదానానికి రూ.2 లక్షల విరాళం

**డ్రీమ్స్ టైమ్స్ మంత్రాలయం:**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో అన్నదానానికి ఆదోని పట్టణానికి చెందిన మీనప్ప అనే భక్తుడు రూ.2 లక్షల విరాళంగా ఇచ్చినట్లు శుక్రవారం మఠం మేనేజర్ ఎస్ కే శ్రీనివాసరావు తెలిపారు. వారికి పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు ఫలమంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

# రైతు బతుకు బుగ్గి పాలు

**-మంటల్లో కలిసిన 20 ఏళ్ల శ్రమ...**
**-ఓ కుటుంబం కన్నీటి గాథ**


అగ్నికి ఆహుతైన మామిడి తోట

**చిట్వేల్, ఏప్రిల్ 3 (డ్రీమ్ టైమ్స్):**
చిట్వేల్ మండలంలోని తిమ్మయ్యగారి పల్లిలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం ఒక రైతు కుటుంబాన్ని అక్షరాలా రోడ్డున పడేసింది. రాటాకొండ రెడ్డయ్యకు చెందిన 8 ఎకరాల మామిడి తోట మంటల్లో కాలిపోవడంతో, దాదాపు రెండు దశాబ్దాల కష్టం ఒక్కసారిగా బూడిదైంది.
సుమారు 20 ఏళ్లుగా చెట్టు చెట్టుగా పెంచుకున్న 550 మామిడి చెట్లు కళ్లముందే అగ్నికి ఆహుతి కావడం రైతు కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచింది. అకస్మాత్తుగా చెలరేగిన మంటలు క్షణాల్లోనే విస్తరించి, మొత్తం తోటను కమ్మేశాయి. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపులోకి తేవడానికి శ్రమించినా, అప్పటికే అపార నష్టం సంభవించింది.
ఈ ఘటనపై రైతు రెడ్డయ్య ఆవేదన వ్యక్తం చేస్తూ, ఇది సహజ ప్రమాదం కాదని అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. "ఎవరో ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టారు. నా జీవితమంతా ఈ తోటపైనే ఆధారపడి ఉంది. ఇప్పుడు ఒక్కసారిగా అన్నీ పోయాయి" అంటూ అతని గళం వణికింది.
ఈ మామిడి తోటే ఆ కుటుంబానికి ఏకైక జీవనాధారం. పిల్లల చదువులు, కుటుంబ ఖర్చులు అన్నీ ఈ పంటపైనే ఆధారపడి ఉన్నాయి. "ఇరవై ఏళ్ల కష్టం ఒక్క రోజులో బూడిద అయింది... ఇక ఎలా ముందుకు వెళ్లాలో అర్థం కావడం లేదు" అంటూ రెడ్డయ్య కన్నీళ్లు పెట్టుకున్నాడు.
గ్రామస్తులు ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, నష్టాన్ని అంచనా వేసి తక్షణ ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు. అదే సమయంలో, ఈ అగ్నిప్రమాదం వెనుక కారణాలను పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.
ప్రభుత్వం స్పందించాలి
జీవనోపాధిని పూర్తిగా కోల్పోయిన ఈ కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉంది. ఇలాంటి ఘటనల్లో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, తక్షణ ఉపశమనం కల్పించాల్సిన అవసరం ఉంది.
వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తున్న రైతులకు ఇలాంటి ప్రమాదాలు ఎదురైనప్పుడు, ప్రభుత్వ సహాయం మాత్రమే వారికి తిరిగి నిలబడే ధైర్యాన్ని ఇస్తుంది. కాబట్టి అధికార యంత్రాంగం వెంటనే స్పందించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# చిత్వేల్ మండలంలో 21 పంచాయతీలకు ప్రత్యేక అధికారులు

**చిత్వేల్, ఏప్రిల్ 3 (డ్రీమ్ టైమ్స్):**
శుక్రవారం నాడు చిత్వేల్ మండలంలో 21 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కె. శ్రీనివాసులు తెలిపారు.
గ్రామపంచాయతీల పదవీకాలం ముగియడంతో, కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు బాధ్యతలు స్వీకరించే వరకు ఈ ప్రత్యేక అధికారులు పరిపాలనను నిర్వహిస్తారని ఆయన వెల్లడించారు.
ప్రభుత్వ ఆదేశాల మేరకు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, మండల స్థాయి అధికారులు తదితరులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు పేర్కొన్నారు.
గ్రామపంచాయతీ నిధుల వినియోగం, పరిపాలన వ్యవహారాలు ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతాయని తెలిపారు.



పంచాయతీల వారీగా ప్రత్యేక అధికారులు:
కందులవారిపల్లి -- పి. స్పందన రెడ్డి (తహసీల్దార్)
సి.ఎం. రాచపల్లి -- ఎం. అనిల్ కుమార్ (మండల ఎస్ జి ఎస్ డబ్ల్యూ అధికారి)
చెర్లపల్లి -- కె. శ్రీనివాసులు (ఎంపీడీఓ)
చిత్వేల్ -- కె. శ్రీనివాసులు (ఎంపీడీఓ)
దేవమాచుపల్లి -- జి. పద్మాభూషణ్ రెడ్డి (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)
కె.ఎస్. అగ్రహారం -- పి. స్పందన రెడ్డి (తహసీల్దార్)
కె.వి.ఆర్.ఆర్.పురం -- జి. సుధాకర్ (మండల వ్యవసాయ అధికారి)
కాంపాసముద్రం -- జి. పద్మాభూషణ్ రెడ్డి (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)
మహారాజపురం -- ఎస్. నస్రీన్ బేగం (డిప్యూటీ ఎంపీడీఓ)
మాలేమర్పురం -- జి. పద్మాభూషణ్ రెడ్డి (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)
మార్గోపల్లి -- పి. స్పందన రెడ్డి (తహసీల్దార్)
మైలపల్లి -- ఎం. అనిల్ కుమార్ (మండల SGSW అధికారి)
నాగవరం -- ఎస్. నస్రీన్ బేగం (డిప్యూటీ ఎంపీడీఓ)
నాగిరిపాడు -- జి. పద్మాభూషణ్ రెడ్డి (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)
నక్కలపల్లి -- డా. పి. తేజశ్రీ (వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్)
నెత్తివారిపల్లి -- జి. పద్మాభూషణ్ రెడ్డి (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)
పొలోపల్లి -- జి. సుధాకర్ (మండల వ్యవసాయ అధికారి)
రాజుకుంట -- కె. శ్రీనివాసులు (ఎంపీడీఓ)
తిమ్మాయగారిపల్లి -- డా. పి. తేజశ్రీ (వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్)
తిమ్మాయపాలెం -- ఎం. అనిల్ కుమార్ (మండల SGSW అధికారి)
తుమ్మకొండ -- ఎం. అనిల్ కుమార్ (మండల SGSW అధికారి)
ప్రత్యేక అధికారులు వెంటనే బాధ్యతలు స్వీకరించి గ్రామాల్లో పరిపాలన సజావుగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటారని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు.

## శ్రీ మఠంలో శతమానోత్సవాల ప్రారంభం


-- జ్యోతిప్రజ్వలన చేసిన ఉత్సవాలను ప్రారంభించిన మఠం పీఠాధిపతులు



**డ్రీమ్స్ టైమ్స్ మంత్రాలయం:**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం లో పూర్వపు పీఠాధిపతులు సుశమీంద్ర తీర్థుల జన్మ శతమానోత్సవాల శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు యోగీంద్ర కళా మండపంలో దీప ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. సంవత్సరం పాటు జరిగే ధార్మిక సాంస్కృతిక , సామాజిక కార్యక్రమాలకు నాంది పలికిందన్నారు. అనంతరం పీఠాధిపతులు అనుగ్రహ సందేశం ఇచ్చారు.

## అనాధలకు సహాయం చేస్తే భగవంతునికి సేవ చేసినట్లే.

--ఆర్డిటి అనాధాశ్రమానికి రూ. 25వేల ఆర్థిక సహాయం.
--వైసిపినాయకులు జక్కయ్య




**మంత్రాలయం మార్చి 3, డ్రీమ్స్ టైమ్స్ న్యూస్ :-**
రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ అనాథ ఆశ్రమానికి 25 వేల ఆర్థిక సహాయం విరాళంగా అందించినట్లు వైసిపి సీనియర్ నాయకులు బుదూరు బుజ్జిగి జక్కయ్య తెలిపారు.
మంత్రాలయం మండలం బూదూరు గ్రామంలో ఆర్డిటి సంస్థ ఏరియా కోఆర్డినేటర్ కృష్ణయ్య,సి.ఓ నరసింహులు లైబ్రరీ అసిస్టెంట్ వీరస్వామిలకు, విరాళం అందజేసినట్టు జక్కయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాధలకు సహాయం చేస్తే భగవంతునికి సహాయం చేసినట్టేనని అన్నారు. తన శక్తి మేరకు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఇలాంటి వారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

